క్లుప్తంగా

చురుగ్గా ఉపాధి హామీ పనులు



పామర్రు: మండల పరిధిలో ఉపాధి హామీ పనులు చురుగ్గా సాగుతున్నాయని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ పోలు రాజు తెలిపారు. మండలంలోని కొమరవోలు, కనుమూరు గ్రామాల్లో ఉపాధి పనులను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం ఏపీఓ మాట్లాడుతూ పనులను నాణ్యతా ప్రమాణాలకు లోబడి నిర్వహించాలన్నారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో 5,620 మంది కూలీలు పనులు చేస్తున్నారని తెలిపారు.

వృద్ధులకు చీరల పంపిణీ



గుడివాడ టౌన్: కొనకళ్ల చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం స్థానిక శాంతి వృద్ధుల ఆశ్రమంలో ట్రస్ట్ చైర్మన్ కొనకళ్ల సీతయ్య చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులను గౌరవించడం వారికి ఆదరవుగా ఉండాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో టి.నాగేశ్వరరావు, ఎస్.రామారావు, కె రామకృష్ణ, బి.కుటుంబరావు, ఎల్.చిట్టిబాబు, అర్జా ప్రసాదు, బ్రహ్మాజీ, రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు మేడూరులో ఉచిత వైద్యశిబిరం

పామర్రు(పమిడిముక్కల): మండలంలోని మేడూరు గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజీ, చిన్నఅవుటపల్లి హాస్పిటల్ వారిచే ఈ ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శిబిరంలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఊపిరితిత్తులు విభాగం, బీపీ, షుగరు, ఆర్థోపెడిక్, ఎముకలు, కీళ్లు, గుండెకు సంబంధించిన ఈసీజీ సదుపాయం కలదని తెలిపారు. చర్మ వ్యాధులకు సంబంధించిన వైద్య సేవలు పీడియాట్రిక్స్ విభాగం, నేత్రసమస్యలు, ఉచిత అపరేషన్‌సౌకర్యం కలదని పేర్కొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పామర్రు: మండల పరిధి కురుమద్దాలి గ్రామంలో శుక్రవారం సాయింత్రం నాలుగు గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పామర్రు ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ పాల్గొంటారని పేర్కొన్నారు. మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

ముదినేపల్లి రూరల్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వెంటనే పూర్తిచేసి గృహప్రవేశాలు చేయాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని పెదపాలపర్రు, పెయ్యేరు, గురజ జగనన్న కాలనీల్లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో వారు మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను ప్రభుత్వం సబ్సిడీ ధరలపై అందిస్తోందన్నారు. అదేవిధంగా నిర్మాణాలు పూర్తయిన దశలను బట్టి ఎలాంటి జాప్యం లేకుండా బిల్లులు మంజూరు చేస్తాందన్నారు. కాలనీలో విద్యుత్, తాగునీరు, డ్రెయినేజీ వంటి సౌకర్యాలను యుద్ధప్రాతిపదికన కల్పిస్తూ లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చేస్తున్నట్లు చెప్పారు. వీటిని సద్వినియోగం చేసుకుని గృహనిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఇప్పటివరకు నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులు తమ పేర్లను వెంటనే గృహనిర్మాణశాఖ అధికారులకు తెలియజేసి అవసరమైన అనుమతులు పొందాలని సూచించారు.

నేడు వలంటీర్లకు సత్కారం

గుడివాడ టౌన్(నందివాడ): నందివాడ మండలానికి చెందిన ఉత్తమ సేవా పురస్కారాలకు అర్హులైన గ్రామ వలంటీర్లకు శుక్రవారం సత్కారం చేస్తున్నట్లు ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నందివాడలోని కొండపల్లి కన్వెన్షన్ హాల్లో సాయంత్రం మూడు గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని), ఎంపీపీ పెయ్యల ఆదాం పాల్గొని సత్కరిస్తారన్నారు.

28న వలంటీర్లకు సన్మానం

మండవల్లి: మండవల్లి మార్కెట్ యార్డ్‌లో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ఆధ్వర్యంలో మండల స్థాయిలోని గ్రామ సచివాలయ వలంటీర్లకు సన్మానం జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ బీ ఆనందబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

చేతి రాత మార్చుకుంటే మంచి భవిష్యత్

పామర్రు: విద్యార్థులు తమ చేతి రాతను ఎంత చక్కగా మార్చుకుంటే అంత మంచి మార్కులు సాధించవచ్చని గ్రంథాలయాధికారి ఎం.ఝాన్సీ రాణి అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవిశిక్షణలో భాగంగా గురువారం విద్యార్థులకు కవితలు రాయించడం, చూచిరాత అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

జమీగొల్వేపల్లిలో..

ఆటలు పిల్లల దైనందిన జీవితంలో ఒక భాగం కావాలని గ్రంథాలయాధికారి ఎం.నాగ సురేష్ అన్నారు. జమీగొల్వేపల్లి గ్రంథాలయంలో వేసవిశిక్షణలో భాగంగా విద్యార్థులకు గురువారం ఆటల పోటీలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్యారమ్స్, చెస్, లూడో, వైకుంఠపాళి, హౌసి తదితర పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. అనంతరం పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

మండవల్లిలో..

మండవల్లి: మండవల్లి గ్రంథాలయంలోని వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం గ్రంథాలయాధికారి షేక్ పర్వీన పర్యవేక్షణలో టీజర్ గేమ్స్‌ను గురువారం విద్యార్థులతో ఆడించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన గనులని తెలిపారు.

గుడివాడ టౌన్: స్థానిక షా ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం నీతి కథలు నేర్పించారు. పిల్లలకు ఈ కథల వలన సమాజంపై అవగాహన, సృజనాత్మకత పెరగడం వంటివి ఉంటాయని విశ్రాంత గ్రంథాలయ అధికారి అవిర్నేని వెంకటేశ్వరరావు అన్నారు. గ్రంథాలయ ఉద్యోగులు ప్రవల్లిక, శిరీష పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇంగ్లీష్ బోధన

ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు గురువారం ఇంగ్లిష్ బోధించారు. మండలంలోని చినపాలపర్రు పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు జంగం బాబూరావు స్పోకెన్ ఇంగ్లిష్, గ్రామర్ వంటి అంశాలను సులభశైలిలో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించారు. లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించి క్విజ్ పోటీలు నిర్వహించారు.



జమీగొల్వేపల్లిలో ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



మండవల్లి గ్రంథాలయంలో టీజర్ గేమ్స్ ఆడుతున్న విద్యార్థులు



ముదినేపల్లి శాఖ గ్రంథాలయంలో ఇంగ్లిష్ బోధిస్తున్న ఉపాధ్యాయుడు

క్రీడలతో మానసిక ఉల్లాసం

కైకలూరు: క్రీడలు మానసిక ఉల్లాసానికి ప్రతీకలుగా నిలుస్తాయని ఎంపీపీ అడవి కృష్ణ అన్నారు. దొడ్డిపట్ల జెడ్పీ హైస్కూల్‌లో దొడ్డిపట్ల ప్రీమియర్ లీగ్ (డీపీఎల్) పేరుతో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల స్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంటును గురువారం ఆయన ప్రారంభించారు. సర్పంచ్ చెరుకువాడ బలరామరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో రెండు జిల్లాల స్థాయి టోర్నమెంటును ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. టోర్నమెంటు నిర్వాహకులు మాట్లాడుతూ ఇప్పటివరకు 30 క్రీడా జట్లు పేర్లు నమోదు చేసుకున్నాయన్నారు. మొదటి బహుమతి రూ.50 వేలు (సర్పంచ్ బలరామరాజు), రెండో బహుమతి రూ.25 వేలు (వుసునూరి వీర సుధాకరరావు), మూడో బహుమతి రూ.25వేలు (ఆగొల్లు సత్యనారాయణ), నాలుగో బహుమతి రూ.15 వేలు (వేములవాడ బసవశంకర్) అందిస్తామన్నారు. వీటితో పాటు మ్యాన్ ఆఫ్ ద సిరీస్, మ్యాచ్, బెస్ట్ బ్యాట్స్‌మెన్, బౌలర్, కీపర్లకు ప్రత్యేక బహుమతులు ఉంటాయని పేర్కొన్నారు. జట్టులో 11 మంది సభ్యులు, ఎనిమిది ఓవర్లు ఉంటాయన్నారు. క్రీడా జట్లు మొత్తం సభ్యులతో కలసి దిగిన ఫొటోను అందించాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్ద కరణం శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ నాగనబోయిన సురేష్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

టోర్నమెంటు ప్రారంభం అనంతరం సమీపంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ బలరామరాజు పరిశీలించారు.



క్రికెట్ టోర్నమెంటు ప్రారంభిస్తున్న ఎంపీపీ అడవి కృష్ణ

పచ్చిరొట్ట విత్తనాల సాగుతో నేలకు మేలు

కురుమద్దాలి(పామర్రు): పచ్చిరొట్ట విత్తనాలను సాగుచేయడం వలన నేల సారవంతమై అధిక దిగుబడులు సాధించవచ్చని మచిలీపట్నం జిల్లా ట్రెనింగ్‌సెంటర్ జిల్లా రిసోర్సు పర్సన్ జ్యోతిరమణి అన్నారు. మండల పరిధి కురుమద్దాలి గ్రామంలోని పచ్చిరొట్టసాగును వ్యవసాయ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో పచ్చిరొట్ట సాగుగా జీలుగ, పిల్లి పెసర, జనుము తదితరాలను సాగు చేయాలన్నారు. పంట అదునుకు వచ్చిన సమయంలో నేలలో కలియ దున్నాలని తెలిపారు. ఈ విధంగా చేయడం వలన నేలలో పోషక విలువలు పెంపొందుతాయని అన్నారు. తద్వారా ఖరీఫ్ సీజన్ వేసే పంటలు అధికంగా పండే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. ఉయ్యూరు చెరకు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త సుధారాణి మాట్లాడుతూ వేసవిలో ప్రతి పంట భూమిలో మట్టి నమూనాలను సేకరించాలన్నారు. సేకరించిన వాటిని ల్యాబ్‌లకు పరీక్షలనిమిత్తం పంపించాలన్నారు. ల్యాబ్ నుంచి వచ్చిన ఫలితాల ఆధారంగా ఆ భూమిలో ఏవిధమైన ఎరువులు ఎంత మొత్తంలో వేయాలని అనే అంశాలను ఆయా రైతులకు వివరించాలన్నారు. రానున్న ఖరీఫ్ సీజన్ వరి నారుమళ్లలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను, చేపట్టి వలసిన పనులను రైతులకు వివరించామన్నారు. మచిలీపట్నం డీటీసీ కేంద్రం ఏఓ బి.పద్మజ, పామర్రు ఏడీఏ స్వర్ణలత, ఏఓ నాగ రాణి, వీఏఏ కిరణ్ పాల్గొన్నారు.



కురుమద్దాలిలో పచ్చిరొట్ట సాగును పరిశీలిస్తున్న అధికారి జ్యోతిరమణి

గృహ నిర్మాణ లబ్ధిదారులకు వ్యక్తిగత రుణం

కైకలూరు: కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (కేడీసీసీ) ద్వారా స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కృషితో జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణదారులకు రూ.2 లక్షల వ్యక్తిగత రుణం అందిస్తారని ఎంపీపీ అడవి కృష్ణ చెప్పారు. కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న కాలనీల్లో రుణాల మంజూరుపై వలంటీర్లతో సమీక్ష సమావేశం గురువారం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ కైకలూరులో దాదాపు 280 మంది లబ్ధిదారులకు రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హౌసింగ్ ఏఈ శేఖర్ మాట్లాడుతూ ఇప్పటివరకు 57 మంది మాత్రమే బ్యాంకు ఖాతాలను ప్రారంభించారన్నారు. మిగిలిన లబ్ధిదారులు ఖాతాలు తెరిచే విధంగా వలంటీర్లు కృషి చేయాలని చెప్పారు. త్వరలో ఎమ్మెల్యే డీఎన్నార్, కేడీసీసీ చైర్మన్ల ఆధ్వర్యంలో మెగా రుణమేళా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు కురేళ్ల బేబీ, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, స్థానిక కేడీసీసీ బ్యాంకు మేనేజర్ రాజు పాల్గొన్నారు.



సమావేశంలో ఎంపీపీ అడవి కృష్ణ, ప్రజాప్రతినిధులు

సీతారామలక్ష్మణులకు ఎమ్మెల్సీ పూజలు



కైకలూరు (కలిదిండి): సీతారాముల ఆదర్శ దాంపత్యాన్ని అందరూ అనుసరిస్తూ జీవనం సాగించాలని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. కలిదిండి మండలం పెదలంక పంచాయతీ అనుబంధ గ్రామం పెదపుట్లపూడిలో సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో ఎమ్మెల్సీ గురువారం పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేసి అక్కడ జరుగుతోన్న హోమం కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు సయ్యపరాజు గుర్రాజు, ముద్దం భోగేశ్వరరావు, ఒడుగు గోపాలరావు, కొక్కిలిగడ్డ వీరాంజనేయులు, దుర్గారావు పాల్గొన్నారు.

ఆలయానికి ప్రహరీ గోడ నిర్మించాలి



పామర్రు: స్థానిక రుక్మిణీ సత్యభామాసమేత వేణుగోపాలస్వామి విష్ణాలయానికి ప్రహరీ గోడ నిర్మించాలని స్థానిక భక్తులు కోరుతున్నారు. గతంలో పాత ఆలయం శిథిలం కావడంతో అదే స్థానంలో నూతన ఆలయాన్ని ఏడాది క్రితం ప్రభుత్వ నిధులు, భక్తుల విరాళాలతో నిర్మించారు. ఈ ఆలయానికి ప్రహరీ పూర్తి స్థాయిలో నిర్మించని కారణంతో ఆలయ ప్రాంగణంలోకి కుక్కలు తిరుగుతూ ఆలయాన్ని అపరిశుభ్రం చేస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ఆలయ ప్రాంగణంలోని చెత్త తొలగించాలని, ప్రహరీ గోడ నిర్మించి ఆలయాన్ని శుభ్రంగా ఉంచాలని భక్తులు కోరుకుంటున్నారు.

నేడు క్యాంపస్ ఇంటర్వ్యూలు

మచిలీపట్నంటౌన్: ఐటీఐలో వివిధ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు స్థానిక బైపాస్‌రోడ్డులోని కృష్ణవేణి ఐటీఐ కళాశాలలో శుక్రవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కొత్తగుండు రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎల్‌అండ్‌టీ, స్కై ఫ్రీ ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (సోలార్) కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఏ కళాశాలలోనైనా ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చని చెప్పారు. ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



ఉయ్యూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అటవీశాఖ మచిలీపట్నం అధికారులు ఎం.వెంకటేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు సూచించారు. వేసవి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా ఉయ్యూరు శాఖా గ్రంథాలయాన్ని గురువారం సందర్శించారు. మొక్కలు నాటడం, సంరక్షించడంతో కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ప్లాస్టిక్‌ను నిషేధించాలని సూచించారు. రిసోర్స్ పర్సన్ ఎం.వెంకటసాయి గణితంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమాలను గ్రంథాలయాధికారి బి.రమణి పర్యవేక్షించారు.

పాడి పరిశ్రమలో మహిళలు ప్రగతి సాధించాలి

గన్నవరం రూరల్: మహిళలు పాడి పరిశ్రమలో ఉన్నతంగా ఎదగాలని ముస్తాబాద పశు చికిత్సా కేంద్రం డాక్టర్ మేరీ వైదూర్యం సూచించారు. గురువారం గోపవరపుగూడెం గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ నల్లూరు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన జగనన్న పాల వెల్లువ కార్యక్రమంలో మహిళా రైతులు, డ్వాక్రా సంఘాలు పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు గ్రూపుల ద్వారా గేదెల కొనుగోలుకు లక్ష రూపాయలు రుణ సౌకర్యాన్ని ప్రభుత్వం కలిగించిందని చెప్పారు. జగనన్న పాల వెల్లువ ద్వారా అమూల్ కేంద్రాల్లో పాలు పోయడంతో మంచి ధర లభిస్తుందని, మహిళల ఆర్థిక ప్రగతికి ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను వినియోగించుకోవాలని చెప్పారు.

నేడు ఆలయ భూముల కౌలు వేలం

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లిలో వేంచేసియున్న శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన 15 ఎకరాల 17 సెంట్ల వ్యవసాయ భూమి కౌలు చేసుకునే హక్కు నిమిత్తం శుక్రవారం టెండర్ కమ్ బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె. లక్ష్మీనారాయణశెట్టి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని ఆర్ఎస్. నెం.426/1, 2, 3లో ఉన్న ఈ భూములను 2023-24 నుంచి 2025-26 వరకు మూడేళ్ల కాల పరిమితికి కౌలుకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగే బహిరంగ వేలంపాటలో పాల్గొన్నాలని కోరారు.

యనమలకుదురులో దాడి కేసు నమోదు

పెనమలూరు: యనమలకుదురులో వ్యక్తిపై మరో వ్యక్తి దాడి చేసిన ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు వినాయక్‌నగర్‌లో రోడ్డులో జరుగుతున్న పైప్‌లైన్ పనులకు వాహనాలు అడ్డుగా ఉన్నాయని అబ్దుల్ కరీం వాహనాలు తీస్తుండగా స్థానికుడు కుమార్ గొడవకు దిగాడు. అంతటితో ఆగకుండా రాళ్లతో కరీంపై దాడి చేసి గాయపరిచాడు. ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

పాతకక్షలతో వ్యక్తిపై దాడి

పెనమలూరు: పాతకక్షల నేపథ్యంలో వ్యక్తిపై మరొకరు దాడి చేయటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామవరప్పాడుకు చెందిన నూరుకుర్తి శ్రీను కానూరు ఆటోనగర్‌లో కర్రీ పాయింట్ నిర్వహిస్తుంటాడు. అతనికి కానూరు మురళీనగర్‌లో ఉంటున్న మోహియుద్దీన్‌కు గతంలో పాతకక్షలు ఉన్నాయి. శ్రీను యనమలకుదురు కృష్ణానది వద్దకు మిత్రులతో వెళుతుండగా అక్కడ ఎదురుపడిన మోహియుద్దీన్ శ్రీనుపై దాడి చేశాడు. దాడిలో గాయపడిన శ్రీను ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇనుప సామగ్రి చోరీ

కంకిపాడు: ఇనుప సామగ్రి చోరీ ఘటనపై కంకిపాడు పోలీసుస్టేషన్‌లో గురువారం రాత్రి కేసు నమోదైంది. ఎస్ఐ కె.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కోలవెన్నులోని జేసీ స్టేషనరీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఫిబ్రవరి 5న ఇనుప గడ్డర్లు, రేకులు, రాడ్లు, ఇనుప సామగ్రి నిల్వ చేశారు. ఈ నెల 24న వాటిని పరిశీలించగా సామగ్రి కనిపించలేదు. సుమారు 10 టన్నుల ఇనుప సామగ్రి చోరీకి గురైనట్లు గుర్తించారు. కంపెనీ సివిల్ ఇన్‌చార్జి హనుమత్ కోటేశ్వరరావు కంకిపాడు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కంపెనీలో విధులు నిర్వహిస్తున్న పలువురు సిబ్బందిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

చలివేంద్రంలో ద్రాక్షరసం పంపిణీ



మచిలీపట్నంటౌన్: వాసవీ వనిత క్లబ్ ఆధ్వర్యంలో గొడుగుపేటలో పాదచారులకు ద్రాక్ష రసాన్ని గురువారం పంపిణీ చేశారు. గొడుగుపేటలోని సాయి డిస్కో డెకరేషన్ సంస్థ సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద గత 41 రోజులుగా మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. దీనిలో భాగంగా దాత డీవీ సాంబశివరావు ఆధ్వర్యంలో పాదచారులకు ద్రాక్షరసాన్ని అందజేశారు. అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ శ్రీకాకోళపు రేణుకారాణి, వైఎస్సార్ సీపీ 38వ డివిజన్ ఇన్‌చార్జ్ శ్రీకాకోళపు నరసింహగుప్తా, వనిత క్లబ్ ప్రతినిధులు వేముల శిరీష, జె. దివ్యశ్రీ, టి. అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

నాగలక్ష్మి దంపతులకు సన్మానం



బంటుమిల్లి: పెద తుమ్మిడి పంచాయతీ శివారు నరసప్ప చెరువు గ్రామానికి చెందిన మానికొండ నాగలక్ష్మి దంపతులను గ్రామస్తులు, గీతా సత్సంగ భక్తులు గురువారం ఘనంగా సన్మానించారు. మైసూరు దత్తపీఠం స్వామీజీ గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశ్రమం వారు దక్షిణ భారత స్థాయిలో నిర్వహించిన భగవద్గీత శ్లోకాల పఠనంలో నాగలక్ష్మి 700 శ్లోకాలు పఠించి బంగారు పతకాన్ని, ప్రశంసాపత్రాన్ని స్వామీజీ చేతులమీదుగా అందుకున్నారు. అనంతరం నాగలక్ష్మి ఆన్‌లైన్‌లో పలువురు భక్తులకు భగవద్గీత శ్లోకాల పఠనంపై శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, భగవద్గీత శ్లోకాలు పఠించిన శిష్యులు కలిసి మానికొండ నాగలక్ష్మి, రాఘవరావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలో అన్న సమారాధన నిర్వహించారు.

ముగిసిన రామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవాలు



బంటుమిల్లి: ఆముదాలపల్లి గ్రామంలోని గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలు గురువారంతో ముగిశాయి. బుధవారం రాత్రి స్వామి వారి శాంతి కల్యాణం పండితులు సోమశేఖరపల్లి ఈశ్వరశర్మ శిష్య బృందం వేద మంత్రాల మధ్య వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారికి, అమ్మ వారికి అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపై ఉంచి మేళతాళాలతో శివనామస్మరణతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు, అర్చకులు గోపాలం పర్యవేక్షించారు.

ఫ్యామిలీ డాక్టర్‌పై అవగాహన కల్పించాలి

అవనిగడ్డ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని మచిలీపట్నం డివిజన్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ కాలారి శ్రీనివాస పెరుమాళ్లు అన్నారు. మండల పరిధిలోని పులిగడ్డలో ఏపీ వైద్యశాఖ, అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన 104 వైద్య సేవలను వేకనూరు పీహెచ్‌సీ డాక్టర్ నాగార్జున ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమాన్ని శ్రీనివాస పెరుమాళ్లు గురువారం పరిశీలించి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి రోగులను డాక్టర్ పర్యవేక్షిస్తున్న తీరుకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా 50 మంది రోగులను డాక్టర్ నాగార్జున పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పుష్పదీవెన, ఏఎన్ఎం సుగుణ, 104 మండల డీఈఓ పి. స్వాతి, సిబ్బంది జి. నాంచారయ్య, ఆశా వర్కర్ నిర్మల, భ్రమరాంబ, సుబ్బమ్మ పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాస పెరుమాళ్లు

ఉల్లిపాలెంలో పూరిల్లు దగ్ధం

కోడూరు: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో రెండు నిట్టాడిల పూరిల్లు దగ్ధమైంది. సేకరించిన వివరాల ప్రకారం.. ఉల్లిపాలెం గ్రామంలో చాట్రగడ్డ రంగారావు కుటుంబ సభ్యులు రెండు నిట్టాడిల పూరింటిలో నివాసముంటున్నాడు. ఇంటి పక్కనే మేకల కోసం ప్రత్యేక చావిడిని నిర్మించారు. గురువారం మధ్యాహ్నం సమయంలో రంగారావు కుటుంబ సభ్యులతో కలిసి పనిపై బయటి ప్రాంతానికి వెళ్లాడు. ఈ నేపథ్యంలో ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. స్థానికులు మంటలు వ్యాపించకుండా ప్రయత్నించారు. అవనిగడ్డ అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశారు.

రూ.5 లక్షల ఆస్తినష్టం..

ప్రమాదంలో రూ.5 లక్షల మేర ఆస్తినష్టం సంభవించినట్లు బాధితుడు రంగారావు అగ్నిమాపక అధికారి పీవీఎస్ ప్రసాద్‌కు తెలిపారు. మేకలను విక్రయించడం ద్వారా వచ్చిన రూ.4.50 లక్షల నగదు ఇంట్లోనే ఉందని, వీటితో పాటు బంగారం, విలువైన వస్తువులు, గృహోపకరణలు, డాక్యుమెంట్లు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయని బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు.



ప్రమాదంలో పూర్తిగా కాలిపోయిన ఇల్లు

భూ రీ సర్వేపై గ్రామ సభలు

మోపిదేవి: రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో 106 సంవత్సరాల తరువాత వైఎస్సార్, జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ప్రవేశ పెట్టిందని తహసీల్దార్ కె. నవీన్‌కుమార్ అన్నారు. మోపిదేవి, పెదప్రోలు గ్రామ సచివాలయాల వద్ద ఆయా గ్రామ సర్పంచ్‌లు నందిగం మేరీరాణి, పొలిమెట్ల ఏసుబాబు అధ్యక్షతన గురువారం గ్రామ సభలు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ 4వ ఫేజ్ భూ రీ సర్వే మోపిదేవి, పెదప్రోలు, వెంకటాపురం గ్రామాల్లో చేపట్టామన్నారు. జియో కో-ఆర్డినేట్ ద్వారా 30 కిలో మీటర్ల వరకు రోవర్ పరికరం రీ సర్వే కవర్ చేస్తుందని చెప్పారు. ఒక్కొక్క రైతు భూమి ఎల్‌పీ నెంబర్‌గా తయారు చేసి గ్రామపటంగా సిద్ధం చేస్తారని, ప్రభుత్వ భూమి డొంకలు, చెరువులు తదితర భూమి రీ సర్వేలో వస్తాయని వివరించారు. మండల సర్వేయర్ సుంకర రామకృష్ణారావు, గ్రామ కార్యదర్శులు త్రిపుర సుందరి, పేర్ని మాధవేంద్రరావు, వీఆర్వోలు శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి నిర్భయానంద స్వామి ఉత్సవాలు

పాగోలు(చల్లపల్లి): నిర్భయానంద స్వామి వారి ఉత్సవాలు గ్రామంలోని కైవల్యాశ్రమ చలాచల బోధోపదేశ మందిర ప్రాంగణంలో శుక్రవారం నుంచి ఈనెల 28 వరకు జరుగుతాయని నిర్వాహకులు, ఎంపీటీసీ మేకా సత్యనారాయణ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ప్రథమ ఆరాధన ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు.